క్లుప్తంగా

21న మండల మీట్

రొంపిచెర్ల: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21న ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. దీనికి ప్రజా ప్రతినిధులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మొరాయిస్తున్న జియో నెట్‌వర్క్

చౌడేపల్లె: మండలంలో జియో నెట్‌వర్క్ సేవలు మొరాయిస్తున్నాయి. వారం రోజులుగా నెట్ సక్రమంగా పనిచేయడంలేదని వినియోగదారులు వాపోతున్నారు. అత్యవసర సమయంలో సమాచారం ఇవ్వడానికి సైతం మొబైల్ సిగ్నల్స్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన



ప్రత్యేక అలంకరణలో గ్రామదేవత గంగమ్మ

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ ఓదులపేట ఎస్సీ కాలనీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో నూతన గ్రామదేవత గంగమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో గ్రామదేవత గంగమ్మ విగ్రహాన్ని ఆదివారం వేడుకగా ప్రతిష్ట చేశారు. వేదపండితులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ వచనం, నవ కలశారాధన, గణపతిహోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం, ప్రాణ ప్రతిష్ఠ తదితర కైంకర్యాలు చేపట్టారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం చేశారు.

నీటి వృథాను అరికట్టాలి



నీటి వినియోగంపై అవగాహన ర్యాలీ

సదుం: వర్షపు నీరు వృథా కాకుండా ఒడిసి పట్టి పొదుపు చేయాలని జోగివారిపల్లె సర్పంచ్ అనితాకుమారి తెలిపారు. జోగివారిపల్లెలో వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నీటి వినియోగం-పొదుపుపై పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో డ్వామా సూపరింటెండెంట్ వేంకటేశ్వర రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ రమేష్ రెడ్డి, పీఓ శోభారాణి, జేఈ వెంకటముని పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి పలువురు భక్తులు ఆదివారం విరాళం సమర్పించారు. సత్యసాయిజిల్లా పుట్టపర్తికి చెందిన సునంద దేవి ఆలయ అభివృద్ధికి రూ.ఒక లక్ష, తిరువళ్లూరుకు చెందిన శారదభాయ్ రూ. ఒక లక్ష నిత్యాన్నదానానికి అందజేశారు. వారికి ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యోగాతో ఆధ్యాత్మిక వికాసం

చిత్తూరు కలెక్టరేట్: యోగసాధనతో శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మిక వికాసం పొందవచ్చని యోగాచార్యులు నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక తపోవనం వృద్ధాశ్రమంలో ఋషి ప్రభాకర్ గురూజీ 12వ పుణ్యతిథి ఆరాధనోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, యోగా సాధనతో సంపూర్ణ, సమగ్ర వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని చెప్పారు. అనంతరం వృద్ధాశ్రమంలోని అనాథలకు దుస్తులు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

వీరత్వానికి సాక్ష్యాలు.. విజయానికి చిహ్నాలు







దండపల్లి వద్ద పులిని వేటాడుతున్న వీరగాళ్ల ప్రతిమ, వీరమరణం పొందిన భర్తతో సతీసహగమనం చెందిన దంపతుల చిహ్నాలు, గంగవరం మండలంలో ఆయుధంతో వీరుడి రాతి ప్రతిమ

- పలమనేరు రెవిన్యూ డివిజన్‌లో వీరగాళ్ల రాతిప్రతిమలు
- వీరుడి భార్యగా సతీసహగమనం చేసిన మహిళల చిత్రాలు
- ఈ ప్రాంతంలో చాలావరకు విజయచిహ్నాలు ధ్వంసం
- కర్ణాటకలో వీరగాళ్లకు ఆలయాలు కట్టి స్మరిస్తున్న వైనం

పలమనేరు: ఎవరికేమైతే మనకేమిలే అనుకునే కాలం కాదది. మనషుల ప్రాణాలను రక్షించేందుకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరులే వీరగాళ్లు. వారి ప్రతిమలే ఈ హీరోస్టోన్స్. పురాతన కాలం నాటి వీరగాళ్ల రాతి బొమ్మలు పలమనేరు రెవిన్యూ డివిజన్‌లో పలుచోట్ల కనిపిస్తున్నాయి. పూర్వకాలంలో శత్రువుల నుంచి, బందిపోటు దొంగల నుంచి, క్రూర మృగాల నుంచి, ప్రకృతి విపత్తుల నుంచి జనాన్ని కాపాడిన నిజమైన హీరోలే వీరు. ప్రజలకోసం వీరు చూపిన ధీరత్వానికి ప్రతీకగా అప్పటి రాజులు, వీరులు వీరత్వాన్ని ప్రదర్శించిన చోటే బండలపై వారి వీరత్వాన్ని ప్రతిబింబించేలా రాళ్లపై ప్రతిమలను చెక్కి వీరులకు కృతజ్ఞతాభివందనాలను తెలుపుకున్నట్టు తెలుస్తోంది. అలాంటి పురాతన ప్రాశస్త్యం కలిగిన చరిత్రను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పలు రకాల వీరగాళ్లు

ఈ ప్రాంతంలోని రాతిబొమ్మలను, నాటి శాసనాలను పరిశీలిస్తే వీరగాళ్లు పలు రకాలుగా ఉన్నట్టు తెలుస్తోంది. శత్రువులపై పోరాడి గెలిచిన వీరులు. దొంగలబారినుంచి గ్రామాన్ని కాపాడిన వీరులు, ప్రకృతి విపత్తులనుంచి జనాన్ని రక్షించిన ధీరులు. పశువులమందను లూటీచేసే దొంగలను చంపిన వాళ్లు వీరగాళ్లుగా చిత్రీకరించారు. వీరమరణం పొందిన భర్తతోపాటు సతీసహగమనం చేసుకున్న వారు. ఇలా రకరకాలుగా వీరగాళ్లు, వీరమహిళలున్నట్టు రాతిబండలపై చెక్కిన చిత్రాలను బట్టి తెలుస్తోంది. వీరులు వాడిన త్రిశూలం, నాటి ఆయుధాలు, సహగమనం చేసిన దంపతులు, నాటి గ్రామదేవతలు, పులి, సింహం లాంటి క్రూరమృగాల చిత్రాలు ఈ బండలపై కనిపిస్తున్నాయి. ఎక్కడైతే వీరులు వీరమరణం పొందారో అక్కడే వీరి విజయచిహ్నాలను చెక్కారు. వీరుడైన భర్తతోపాటు భార్య సహగమనం చేసిన చోటే భార్యాభర్తల చిత్రాలను రాతిబండలపై చెక్కారు.

ఇది నాటి చరిత్ర

పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలోని ముళబాగిల్ ప్రాంతం అప్పట్లో ఒక్కటిగా ఉండేదని ఇక్కడి గ్రామాల్లోని శాసనాల, తామ్రపత్రాల ఆధారంగా తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని నోలంబ పల్లవులు, నోలంబులు, వైదంబులు, విజయ నగరరాజులు ఆపై గంగరాజులు పాలించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. అనంతరం రాజప్రతినిధులు, పాళేగాళ్లు, జమీందార్లు, మణేగార్లదాకా పాలన చేసినట్టు తెలుస్తోంది.

రాతిప్రతిమలు ఎక్కడంటే...

పలమనేరు నియోజకవర్గంలోని దండపల్లి, నిడిగుంట, శివాడి, కలగటూరు, నేలపల్లి, కరసనపల్లి, ముత్తుకూరు, కొళత్తూరు, చదళ్ల, చలమంగళం, లద్దిగం, బూడిదపల్లి, పెనుగొలకలలో ఉన్నాయి. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, ఉప్పరపల్లి, మంగళం, బోడినాయునిపల్లి, బూడిదపల్లి, మినికి, సూరకుంట, రామసముద్రంతోపాటు కర్ణాటకలోని సరిహద్దు గ్రామాలైన ఎంబాడి, ఊలపాడు, నంగిళి, నగవార తదితర గ్రామాల్లో కనిపిస్తున్నాయి. కర్ణాటకలోని కొన్ని గ్రామాల్లో వీరగాళ్లకు అప్పట్లోనే ఆలయాలను సైతం నిర్మించారు. అవి ఇప్పటికీ శిథిలావస్థలు చేరి కనిపిస్తున్నాయి.

రాతి బొమ్మలను కాపాడుకోవాలి

ఈ ప్రాంతంలోని వీరగాళ్ల రాతిబొమ్మలను పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకొని కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. దీంతోపాటు వీటి చరిత్రను ద్రవిడవి శ్వవిద్యాలయ తెలుగు పరిశోధన విభాగం పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మద్రాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టు

ఈ ప్రాంతంలోని పురాతన గ్రామాలకు సంబంధించిన చరిత్ర మద్రాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టులో ముద్రింపబడిఉంది. దానిమేరకు ప్రస్తుతం వీరగాళ్ల రాతిప్రతిమలున్న దండపల్లిని మహామండలేశ్వరులు పాలించినట్టు ఉంది. నాటి రాగిశాసనాలతో త్రయంభక అనే సంతకం ఉండడంతో క్రీ.శ 1410లో రాయలవంశస్తుడైన రాజు విజయ భూపతి పాలన ఉన్నట్టు తెలుస్తోంది. దీన్ని అప్పట్లో ముళబాగిళు పరగణ, పులినాడు మహామండలంలోని క్రియాశక్తిపురం(నేటి దండపల్లి)గా ఉంది. నాటి రాజులిచ్చిన ఇనాము భూముల వివరాలు సైతం కొందరు మణేగార్ల వద్ద ఉన్నట్టు తెలుస్తోంది. నాటి చరిత్రకు సాక్ష్యాలుగా ఈ గ్రామంలో పురాతన రామేశ్వరాలయం, లక్ష్మీనారాయణ ఆలయాలున్నాయి. ముళబాగిలు పరగణాలో సుమారు 500 గ్రామాలు వుండేవని వీటికి సంబంధించిన చరిత్ర సైతం తామ్రపత్రాల్లో ఉంది.



నాటి చరిత్రను తెలిపే తామ్రపత్రాలు

వందలాది రాతిబొమ్మలున్నాయి

పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలోని ముళబాగిలు ప్రాంతాల్లో నాటి వీరగాళ్ల రాతిబొమ్మలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీరగాళ్లకు సంబంధించిన చరిత్రను శాసనాలు, తామ్రపత్రాల ద్వారా పరిశోధిస్తున్నాను. చరిత్రకు సాక్ష్యాలైన విలువైన వీటిని కాపాడుకోవాల్సిన అవసరం పురావస్తు శాఖపై ఉంది.

–మునిరత్నం రెడ్డి, చరిత్ర పరిశోధకులు, బత్తలపల్లి

ధ్వంసం చేసేశారు

మాది పురాతన చరిత్ర కలిగిన గ్రామం. మా పొలం పక్కనే చాలా వీరగాళ్ల చిహ్నాలున్నాయి. కొన్నింటిని గుప్తనిధుల కోసం తవ్వి ధ్వంసం చేశారు. వీటి గురించి ఇప్పటివారికి పెద్దగా తెలియదు. ఏందో రాళు అనుకుని పట్టించుకోవడం లేదు. కానీ వీటికి సంబంధించిన చరిత్ర రాబోవు తరాలకు తెలియాలంటే వీటిని కాపాడుకోవాలి.

–శ్రీనివాసులు, దండపల్లి, గంగవరం మండలం

చింతామణికి ఆర్టీసీ బస్సు నడపండి

పుంగనూరు: స్థానిక డిపో నుంచి కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన చింతామణి, శ్రీనివాసపురానికి రామసముద్రం మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. పుంగనూరు వాణిజ్య కేంద్రం కావడంతో శ్రీనివాసపురం, చింతామణి నుంచి పుంగనూరుకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన సంతలు కర్ణాటకలో ఉండడంతో వ్యాపారులు తమ సరుకులు తీసుకుని ఆటోల్లో వెళ్లడం వల్ల వారికి ఖర్చు పెరిగిపోతోంది. అదే సమయంలో ఆర్టీసీ బస్సులు చింతామణి, శ్రీనివాసపురానికి నడిపితే మంచి ఆదాయం ఆర్జించవచ్చని, స్థానిక వ్యాపారులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని వాపోతున్నారు. ఈ విషయమై డిపో అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ కారణంగా ప్రైవేటు బస్సులు రోజు వేలాది రూపాయల ఆదాయం గడిస్తున్నాయని చెప్పారు.

వైభవంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

పుంగనూరు: విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు వారి 555వ జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని కృష్ణదేవరాయ సర్కిల్లో బలిజ సంఘం నాయకులు సమావేశమై, రాయల వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలవారి సేవలను కొనియాడారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నానబాలమణి, పూలత్యాగరాజు, గణేష్, మధుసూదన్‌రాయల్, మణి, ప్రకాష్, నరేంద్ర, రమణ, గంగాధర, నరేష్, కుమార్, మోహన్, ఆనంద, యుగంధర్, పూలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

వి.కోట: పట్టణంలోని శ్రీ విద్యానికేతన్, సీవీఆర్ఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థల కరస్పాండెంట్ దామోదర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ పట్టణంలోని మిట్టూరు రోడ్డులో గల విద్యానికేతన్ క్యాంపస్‌లో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, అపోలో, యాక్సిస్, రిలయన్స్, హెచ్‌డీబీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధుల ద్వారా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు 94932 27040, 94931 58525ను సంప్రదించాలని తెలిపారు.

నూతన వధూవరులకు పెద్దిరెడ్డి ఆశీర్వాదం





నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలతమ్మ, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి

రొంపిచెర్ల: నూతన వధూవరులను పుంగనూరు ఎమ్మెల్యే దంపతులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలతమ్మ, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆశీర్వదించారు. మండలంలోని పెద్దగొట్టిగల్లు సమీపంలో ఉన్న వి.ఎం.ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన యండపల్లె రామకృష్ణారెడ్డి, మంజులాదేవి దంపతుల కుమారుడి వివాహానికి హాజరైన పెద్దిరెడ్డి కుటుంబం వధూవరులు శ్రీనాథరెడ్డి, శ్రావణిని ఆశీర్వదించారు. అక్కడే జరిగిన శివశక్తి డెయిరీ మేనేజర్ పురుషోత్తం రెడ్డి కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులు సాయి భరద్వాజ్ రెడ్డి, గాయత్రి ప్రియను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పెద్దిరెడ్డి, ఇందిరమ్మ, సుధీర్ రెడ్డితోపాటు జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, పులిచెర్ల ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెంచురెడ్డి, విజయశేఖర్, మహబుబ్‌బాషా, కల్లా సురేంద్రనాయుడు, అమరనాథ రెడ్డి, శ్రీనాథనాయుడు, బాలాజీ, సూర్య నారాయణ రెడ్డి, యుగంధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, అల్లాబక్స్, విజయభాస్కర్ రెడ్డి, సి.వి.రమణ, శివారెడ్డి, వెంకటరత్నం, పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

రొంపిచెర్ల: రైతు సేవా కేంద్రాల్లో రైతు గుర్తింపు సంఖ్య కోసం వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు నంబరు వస్తుందన్నారు. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలకు ఆర్థిక సాయానికి ఈ యూనిక్ ఐడీ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంటల బీమా, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాలు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలపై వడ్డీ రాయితీ యూనిక్ ఐడీ ద్వారానే వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

బైరెడ్డిపల్లె: గంగజాతర సందర్భంగా పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లోని విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో 25 జట్లు వరకు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి బహుమతిగా కోలార్ టీమ్ – రూ.50,116, రెండవ బహుమతిగా వేలూరు డేంజర్‌బాయ్స్ టీమ్ – రూ.30,116, మూడవ బహుమతిగా పాండిచ్చేరి టీమ్ – రూ.20,116, నాలుగో బహుమతిగా తమిళనాడు ముత్తూరు టీమ్ – రూ.10,116 కై వసం చేసుకున్నారు. పూర్వవిద్యార్థులు శేఖర్‌గౌడు, లియాఖత్ ఆలీ, విద్యాసాగర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, ప్రవీణ్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా గంగజాతర సందర్భంగా వాలీబాల్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వాలీబాల్ పోటీలను తిలకించారు.



విజేతలకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కోలాహలంగా సాగిన ఎడ్ల పందేలు



కొలమాసనపల్లిలో దూసుకెళుతున్న ఎద్దు



బైరెడ్డిపల్లె మైలేరులో దూసుకుపోతున్న పశువులు

పలమనేరు: పలమనేరు మండలంలోని కొలమాసనపల్లిలో ఆదివారం మైలేరు పండుగను ప్రజలు కోలాహలంగా నిర్వహించారు. ఇక్కడ ఏటా ఆనవాయితీగా మైలేరు (ఎడ్ల పందాలు)ను నిర్వహిస్తారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన పోటీ ఎద్దులను ప్రభలతో అలంకరించి గ్రామ నడివీధిలో పరుగెత్తించారు. యువత కేరింతలు కొడుతూ ఎద్లను నిలువరించేందుకు ఉత్సాహం చూపారు. ఎక్కువ వేగంగా వెళ్లిన ఎద్దులకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారేకాకుండా అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు తరలివచ్చారు.

ఉరకలేసిన ఉత్సాహం

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని పెద్దచెరువు సమీపంలో ఉన్న రహదారిలో ఆదివారం నిర్వహించిన మైలేరు పండుగ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పశువులన్నీ ఈ పరుగుపందేనికి తీసుకువచ్చారు. భారీ జనసందోహం మధ్య పశువులు పరుగులు తీస్తుంటే యువత ఉత్సాహానికి హద్దుల్లేవు. దూసుకెళుతున్న పశువులను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపారు. గెలుపొందిన పశు వులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటివైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరు నగరానికి చెందిన శంకర నేత్రాలయానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేపట్టారు. సాయిమాత సేవాట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 160 మంది కంటి రోగులు హాజరై చికిత్సలు తీసుకున్నారు. వీరిలో 40 మంది ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎంపిక చేశారు. వీరికి బెంగళూరులోని శంకరా నేత్రాలయ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసి, లెన్స్ అమర్చనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర ఆస్పత్రి వైద్యులు శివ, విజయ్, లావణ్య పాల్గొన్నారు.

శివరాత్రి విశిష్టతపై ఇంటింటా ప్రచారం

గంగవరం: ఇంటింటా హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా మండలంలోని కూర్నిపల్లి గ్రామంలో శివరాత్రి పండుగ విశిష్టతపై భగవద్గీత సారాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం నిర్వహించారు. శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, పరమాత్మలకు గుర్తు అన్నారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని అందుకే మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడతారన్నారు. మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికంలో ముఖ్యమైన విషయం అన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానాన్ని తెలియజేయడం అర్థమన్నారు. కావున అందరూ మోక్షం పొందాలనేదే శివరాత్రి పండుగ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు, సభ్యులు భాస్కర్, బాలాజి, వాణిశ్రీ, ఉదయ్, రాజేంద్ర, రెడ్డెమ్మ, రేఖ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో విశ్వశాంతి సాధ్యం

కుప్పంరూరల్: భగవద్గీత పఠనంతో విశ్వశాంతి సాధ్యమని ప్రబోధానంద సేవాసమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ప్రబోధానంద సేవాసమితి సభ్యులు కుప్పం పట్టణం సమీపంలోని మోడల్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత ప్రాముఖ్యత గురించి వివరించారు. కుల, మతాలకు అతీతంగా భగవద్గీత పఠనంతో విశ్వశాంతి సాధ్యమన్నారు. ఎలాంటి ప్రశ్నకైనా భగవద్గీతలో దొరుకుతుందని కృష్ణ అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రబోధానంద రచించిన పుస్తకాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్, శరవణ, దేవరాజు, రాజ్‌కుమార్, చరణ్, లోకేష్, శివకృష్ణ, వాణి, వెంకటలక్ష్మీ, మైత్రి ఉన్నారు.



భగవద్గీత ప్రాముఖ్యతపై ప్రచారం చేస్తున్న ప్రబోధానంద సేవాసమితి సభ్యులు

బస్.. పుస్స్‌స్స్‌స్స్‌స్స్..!

బస్సెనక బస్సు వచ్చి
పంక్చర్‌తో ప్రయాణం కుస్తీ
ఇంకే బస్సు వస్తుంది కొడుకో...



నేంద్రగుంటలో పంక్చర్ వేయించుకోవడం కోసం ఆగిన బస్సులు

అన్న తరహాలో ప్రయాణికులు కస్సుబుస్సుమన్నారు. ఇక తిరుపతికి చేరేకాడికి ఏటైమవుతుందో సామీ అని నిట్టూర్చారు. ఆదివారం సాయంత్రం పుంగనూరు–తిరుపతి పల్లెవెలుగు సర్వీసు పాకాల బస్టాండ్‌కు 4.30 గంటల సమయంలో వచ్చింది. అప్పటికే పడిగాపులు కాస్తున్న జనం పొలోమంటూ బస్సు ఎక్కారు. అప్పటికే బస్సులో సీట్లు లేక నిలబడి ప్రయాణిస్తున్న వారికితోడు పాకాల జనంతో బస్ ఫుల్ అయ్యింది. బస్ ఇరంగారిపల్లె దాటిన కొన్ని క్షణాలకే పుస్స్‌స్స్‌స్స్‌స్స్..మంటూ శబ్దం వస్తూండడంతో డ్రైవర్ అనుమానించి బస్సు పక్కన ఆపి, దిగి టైర్లు చెక్ చేశాడు. ఎడమవైపు వెనుక టైర్ పంక్చరై గాలిపోతున్నట్టు గుర్తించాడు. దీంతో ప్రయాణికులు డీలా పడ్డారు. పంక్చరేయించుకుని పోదాం అని డ్రైవర్ మళ్లీ బస్సు స్టార్ట్ చేశాడు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని నేంద్రగుంట సమీపంలోని ఓ షాపు వద్ద నిలిచి ఉన్న ఓ బస్సు వెనుక ఆపాడు. దీంతో ముందరి బస్సులోని ప్రయాణికులు, కండక్టర్ రయ్‌మంటూ ఈ బస్సు వద్దకు వచ్చారు. స్నోవ్! వీళ్లందర్నీ ఎక్కించుకోనా!? మా బస్సు పంక్చరైంది. ఈడ పంక్చరేపిచ్చేకాడికి లేటవుతుందని ఆ బస్సు కండక్టర్ చెప్పాడు. ఏంబా! మా బస్సు కూడా పంక్చరైంది.. అందుకే మీ బస్సు ఎనక ఆపినం. ఈ షాపులో పంక్చరేపిచ్చేదానికి అని కండక్టర్ చెప్పేకాడికి ఒకరి ముఖాలు ఒకరి చూసుకున్నారు. మీదీ సేమ్ కేసేనా! అనేసరికి ప్రయాణికులు నిట్టూరుస్తూ కిందకు దిగారు. ఇలా ముప్పావు గంట వ్యవధిలో పుంగనూరు–తిరుపతి సర్వీసులు రెండూ పంక్చరై, ఒకే షాప్ వద్దకు పంక్చర్ వేయించుకోవడానికి చేరుకోవడం అక్కడి వారికి ఆసక్తి కలిగించింది.

–పాకాల

బోయకొండలో పెరిగిన భక్తుల రద్దీ





చౌడేపల్లె బోయకొండలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు, భక్తుల రద్దీ

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మతల్లి దీవెనలకోసం భక్తులు బోయకొండకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోయకొండలో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఆదివారం ఒక్క రోజే సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ జంతుబలులిచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.